# శివంగి

- భావరాజ రాజ్యలక్ష్మి

సాయంత్రం టైము నాలుగైంది.

శివంగి వరండాలో విచారంగా కూర్చుంది.

ఆమె మనసులో నిరాశా, నిస్పృహలు.

అరగంట క్రితం శానమ్మ వచ్చి గుడిసెకి అద్దె రెండునెలలుగా కట్టలేదని పెద్ద తగూ పెట్టి వెళ్లింది.

ఒక వారంలో అద్దె కట్టకపోతే గుడిసె ఖాళీ చేయమని వార్నింగ్ ఇచ్చి మరీ వెళ్లింది.

శివంగి విచారంగా అనుకుంది 'ఈ గవర్నమెంటోళ్లు పేదోళ్లకి ఇళ్ళు ఇస్తాం... ఇవి చేస్తాం... అవి చేస్తాం అంటారు. అన్నీ ఉట్టి కబుర్లే. సేతల్లో ఏటీ ఉండవు. ఇంకా ఓటో తారీఖు రావటాన్కి పదిహేనురోజులున్నాయి. ఎలా కట్టాలద్దె?

ఈ సచ్చినోడు తాగుడు మానడు. ఎలా? ఛీ... ఎన్ని దినాలిలా గడవాలి? ఈ బతుకెప్పుడు బాగు పడ్తది?

ఈ బతుక్కో అరదంలేదు. ఎదవ బతుకు. ఎప్పుడూ పస్తులు, అప్పులు, దెబ్బలు.. ఓ సంతోషం లేదు, సరదా లేదు, ఈసురోమని బతుకు ఎళ్లదీసుకోవాలి.

ఏ రోజుకైనా ఈ బతుకు బాగుపడుతుందా? ఆ ఆశ ఎక్కడా కంటిక్కనబడ్డంలా? ఎందులో నన్నా పడి సచ్చిపోతే బావున్ను?' కళ్లల్లో నీళ్ళు తిరిగాయి శివంగికి.

కొడుకు కళ్లల్లో మెదిలాడు.

'అమ్మో! అలా సెయ్యకూడదు సోమా ఏటైపో తాడు?' అనుకుంది.

* * *

"అమ్మా!" సోమా స్కూల్ నుండి వచ్చాడు.

శివంగి గబగబా పొయ్యి రాజేసి కొబ్బరి మట్టా, కొబ్బరి చిప్పలూ పొయ్యిలో వేసి నీళ్లు కాచింది.

సోమాకి వుడుకు వుడుకు నీళ్ళు పోసి, చొక్కా లాగూ వేసి తల దువ్వింది.

తాను కొని తెచ్చిన బ్రెడ్ పంచదార లేని టీలో ముంచి తియ్యితియ్యని కబుర్లు చెబుతూ కొడుక్కి తినిపించింది. ఇంటి ముందు నులకమంచం వేసి తనూ, సోమా కూర్చున్నారు. కొంగు ముడి కట్టుకున్న చాక్లెట్ విప్పి వాడి నోట్లో కూరి చదువుకో మంది.

వాడు తియ్యితియ్యని ఊట మింగుతూ పెద్ద గొంతుకతో హుషారుగా పదహారో ఎక్కం చదవ సాగాడు.

సోమాకి పదహారో ఎక్కం రావడంలేదు. అయినా వాడు విసుగు చెందని విక్రమార్కుడిలా పట్టుదలగా కంఠస్థం చేయసాగాడు.

శివంగి సంతోషంగా, తృప్తిగా తన కొడుకుని చూస్తోంది.

సోమా పెద్ద పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగం చేస్తూ ఖరీదైన ఇస్త్రీ బట్టల్లో తిరుగుతు న్నట్లనిపించింది.

"శివంగీ!" పెద్ద అరుపుకి ఉలిక్కిపడింది.

ఈరయ్యి తూలుకుంటూ వచ్చాడు.

"నీకు నీవారులేరు, నాకు నావారు లేరు" అని పాడుకుంటూ నిలబడలేక నేలమీద చతికిలబడి కూనిరాగాలు తీయసాగాడు.

'ఈడి మొకానికి పాటలోటి తక్కువ' అని కసిగా అనుకుంది.

"జానకమ్మగోరింటికి పన్లోకి పోతున్నా. జాగ్రత్తగా కూకుని సదూకో. ఓ గంటలో వస్తా" అని కొడుక్కి చెప్పి రోడ్డెక్కింది.

* * *

శివంగి వసారాలో కూర్చుని వంకాయలు తరుగుతోంది.

జానకమ్మ వంటింట్లో వంట చేస్తోంది.

"శివంగీ! తరగడం అయిందా?" అంటూ బయటకొచ్చింది జానకమ్మ.

"ఇదిగోనమ్మా అయిపోనాయి" అంటూ మరో మారు నీళ్ళతో వంకాయ ముక్కలు కడిగి అక్కడ పెట్టి గోంగూర కట్టలందుకుని జాగ్రత్తగా ఆకులు ఏరసాగింది శివంగి.

"వీరిగాడు తాగుడు మానేడే శివంగీ?"

"అబ్బే! ఆడికి పుట్టుకతో వచ్చింది బుద్ధి. అది పుడకల్తోనే పోవాలి" విరక్తిగా అంది శివంగి.

"పాపం నువ్వు మాత్రం ఒక్కదానివి ఎలా ఇల్లు గడుపుతున్నావో! వేలకి వేలు వస్తూ వుంటేనే కటకటలాడిపోతారు. పోనీ మీ అత్తకి చెప్పలేకపోయావా? అదేనా కాస్త మంచీ చెడ్డా చెప్తే వింటాడేమో?"

"అబ్బే! ఆడి సెవులు దిబ్బడిపోనాయి. ఓలు సెప్పినా ఇనడు. అయినా ఓపాలి మా అత్తమ్మ దగ్గరికి అదే ఆ పల్లెకు పోయి సెప్పినా. అదంటుందీ 'పెళ్లికి ఆడు బాగానే వున్నాడే. నిన్ను కట్టుకున్నాకే ఇలా తగలడ్డాడు. అంతకు మునుపు ఏ అలవాటూ లేదు' అని నింద నామీదకి ఎట్టెసింది. అయినా ఆ ముసల్దాని తప్పు కాదులెండి. తల్లి పానం! కొడుకుని అలా ఎనకేసుకొచ్చింది. అయినా ఈడికుండాలి బుద్ధి!"

"పోనీ మీరూ అక్కడి వెళ్లొచ్చుకదే. అదే మీ అత్త దగ్గరకు"

"ఆ పల్లెలో ఏటుందమ్మగోరూ! పొలాలకి నీళ్ళు నేవు. వంటల్లేవు. కూలీ నాలీ దొరకదు. అక్కడోల్లే ఇలఇల్లాడి సచ్చిపోతున్రు. పసువులకే తినడానికి గడ్డి లేదు. ఇంక మణుసులకేటుంటాది? ఇక్కడైతే ఏదో కూలీ నాలీ దొరుకుతుంది. అయినా ఈడికి రోజుకి నూరు రూపాయలు కూలి దొరుకుతుంది. ఆ డబ్బుల్తో తాగేసి వచ్చేస్తాడు. అయినా అమ్మగోరూ! మన గవర్నమెంటోళ్ళు ఈ సారా కొట్లు ఎత్తేసి సారా తాగకూడదు అని ఓ రూలెట్టేస్తే

బావున్ను. ఇనాంటోల్లు బాగుపడ్తారు. మానాంటి ఆడోళ్ళు సుఖపడ్తారు''

"అదీ అయిందే కొన్నాళ్ళు. అప్పుడు సారా తాగే వాళ్లందరూ చాటుగా, దొంగతనంగా త్రాగే వాళ్ళు. ఇప్పుడు పబ్లిగ్గా తాగుతున్నారు. రూల్సు దేముంది చెప్పు. ప్రభుత్వాలు మారితే రూల్సూ మారిపోతాయి. అసలు మార్పు మనుషుల్లో రావాలి. వాళ్ల మనసుల్లో రావాలి. మనిషి మానవ త్వంతో బ్రతకాలి. తన కర్తవ్యాన్ని సమర్ధవంతంగా నిర్వర్తించాలి''

"అంతేనమ్మగోరూ!'' అంది ఏదో అర్ధం అయి నదానిలా.

"పోనీ ఓ పని చెయ్యి. ఈసారి తాగి నిన్ను తన్నినప్పుడు పోలీస్ కంప్లైంట్ ఇయ్యి. నాలుగురో జులు స్టేషన్‌లో పెడ్తే తెగులు కుదుర్తుంది''

"ఆడికి పోలీసులంటే బయం నేదమ్మా. ఓపాలి తాగి కల్లు కొట్టోడి మీద సెయ్యి చేస్కున్నాడు. ఆడు పోలీసుల్ని పిల్సి పోలీస్‌స్టేషన్‌లో ఎట్టించే సాడు. అప్పుడు నానెల్లి చెవుకమ్ములమ్మి ఇడిపించాను. ఎటొచ్చినా నసటం నాకే. ఎన్నిరకాలుగా సెప్పినా మానవేదు'' అంది నిరాశగా.


"పావం. పోనీలేవే. నీవేం దిగులు పెట్టుకోకు. మంచే జరుగుతుంది. కాస్త ఓపికపట్టు. సత్యం బాబుగారు ఈ నెల నుండి నీకు జీతం ఇంకో వంద రూపాయలు ఎక్కువ ఇమ్మన్నారు. శివంగీ! రేపు ఉదయం మేము ఊరు వెళ్తున్నాం పెళ్లికి. వచ్చేసరికి ఒక వారం అవుతుంది. మధ్యమధ్యలో వచ్చి మొక్కలకి నీళ్ళు పోస్తూ వుండు'' అంది.

జానకమ్మ ఊరు వెళ్తానంటే శివంగికి కాస్త బాధగా వుంటుంది.

ఆవిడ మిగుళ్ళు తగుళ్ళు అంటూ ఏవో ఇస్తూ వుంటుంది. ఆవిడ ఇచ్చేవాటి మీద ఆశ శివంగికి.

ఈవారం అంతా ఏమీ దొరకవు. ఒకవైపు నిరాశే.





## నిరాడంబరత

అందరూ ఇష్టపడే సినిమా తారలు సినిమాల్లోలాగే బయట కూడా చాలా హంగామా చేస్తారు. అయితే చాలా సింపుల్‌గా ఉండడం తనకెంతో ఇష్టం అని అంటోంది హేమమాలినీ తనయ ఈషా డియోల్. 'నా తల్లి సినిమా రంగంలో ఉన్నా నేను ఎక్కడికెళ్లినా చాలా సింపుల్‌గా ఉంటాను. నిరాడంబరత అంటే నాకెంతో ఇష్టం. నా తల్లి కూడా అదే చెప్తుంది. తాను చెప్పినట్లు నడుచుకుంటుంది. అయితే కొన్ని విషయాల్లో మా ఇద్దరికీ చాలా తేడాలుంటాయి. జనరేషన్ మారినప్పుడు ఈ మాత్రం తేడాలు మామూలే కదా!' అంటోంది ఈ భామ. ఏది ఏమైనా తల్లీకూతుళ్ళు మాత్రం ఇప్పటికీ స్నేహితుల్లాగే మెలుగుతుంటారట.

జీతం వంద పెరిగిందంటే సంతోషం మరో వైపు. అన్ని పనులూ చక్కపెట్టి లేచింది శివంగి.

"వస్తానమ్మగోరూ" అంది.

"శివంగీ! ఫ్రిజ్ ఖాళీ చేసాను. ఆ సంచీలో పళ్ళూ కూరగాయలూ వున్నాయి. పట్టుకెళ్ళు. ఇదిగో ఈ డబ్బులు కూడా వుంచుకో"

శివంగి అమ్మగారిచ్చిన సంచీ, డబ్బులు సంతోషంగా అందుకుంది.

'డబ్బులుంటే మాత్రం పెట్టే గుణం అందరికీ ఉంటుందా? ఇలాంటి అమ్మగోర్లూ, అయ్యగోర్లూ ఎయ్యేళ్ళు సల్లగా ఉండాలి' మనస్ఫూర్తిగా అనుకుంటూ నడిచింది.

* * *

ఉదయం టైము పదిగంటలైంది.

శివంగి బట్టలుతికి ఆరవేసి వచ్చింది.

"అమ్మగోరూ! కూరగాయలిస్తే తరిగేసి ఎల్తాను" అంది.

కూరగాయలూ, చాకూ ఇచ్చింది జానకమ్మ.

శివంగి కూనిరాగాలు తీస్తూ కూరలు తరుగుతోంది.

శివంగి పెద్ద పెద్ద గళ్ళున్న చీర గోచీ పోసి కట్టింది. అందంగా ముడి చుట్టి పెద్ద బంతి పువ్వు తురిమింది. పెద్ద బొట్టు.

'ఇది నల్లగా వున్నా చక్కగా, కళగా వుంటుంది' అనుకుంది జానకమ్మ.

"అవునే శివంగీ! ఇవాళ చాలా హుషారుగా వున్నావు. పాటలు కూడా బాగా పాడుతున్నావు. ఏమిటి సంగతి?" అంది నవ్వుతూ జానకమ్మ.


"అవునమ్మా. మీరు ఊర్లో నేరు. అప్పుడు ఇసిత్రం జరిగింది"

* * *

సాయంత్రం టైము అయిదు గంటలయింది.

శివంగి కొడుకు పెద్ద గొంతుకతో పదహారో ఎక్కం చదువుతున్నాడు.

వాడికి పదహారో ఎక్కం అంటే భయం పోయింది.




ఇప్పుడు ఒక్క తప్పు రావడం లేదు. చూడకుండా ఆరోసారి గడగడా చదివి "ఓలమ్మో! నాకు పదారో ఎక్కం వచ్చేసినాది" అన్నాడు.

శివంగి కొడుకు పట్టుదల చూసింది. అందుకే కొడుకుని దగ్గరకు తీసుకుని ముద్దు పెట్టుకుంది.

"నా తండ్రే ఇలాగే సదివి... బాగా సదువుకుని మంచి ఉద్యోగం సేసుకుందువుగాని" అంది సంతోషంగా శివంగి.

"ఓలమ్మో! నేను నోటుసు బుక్ కొనుక్కోలే" అన్నాడు.

"ఎంతగుతాదేటి?"

"అయిదు రూపాయలే!"

"సరే!" ముంత క్రింది దాచిన డబ్బులు తీసి అయిదు రూపాయలిచ్చింది.

వాడు సంతోషంగా కొట్టుకు బయల్దేరుతుంటే ఈరిగాడొచ్చాడు తూలుతూ.

"ఎక్కడివిరా ఆ డబ్బులు?" అన్నాడు.

"అమ్మ ఇచ్చిందయ్యా. బుక్ కొనుక్కోవలె" అన్నాడు భయం భయంగా.

మొహం చిట్లించాడు ఈరిగాడు.

"బుక్కా! ఇంతోటి సదువుకి దండుగ ఖరుసులు. ఇలా తేరా" అన్నాడు.

"ఆడు సదుకుంటున్నాడు. పుస్తకం కొనకపోతే ఎట్టా? నేనే ఇచ్చినా?" అంది శివంగి తాపీగా.

"ఇస్తావు... ఇస్తావు. నీ బాబు డబ్బు. ఈడికి సదువెందుకు? నే చెప్పొచ్చా రేపటికాడినుండి మూడు కేరేజీలు పట్టుకెళ్లాలి. మనిషో అరనై రూపాయలిస్తాడు. ఓరి సోమా! రేపటి నుండి బడి కెళ్లొద్దు" అన్నాడు.

శివంగి కోపంగా ముందుకు వచ్చింది.

"ఏటేటీ! ఆడు సదువుమానెయ్యాలా. ఇసుకూలు మానెయ్యాలా, కేరేజీలు మొయ్యాలా! నేదు... ఆడు సదూకుంటాడు" ఖచ్చితంగా చెప్పింది శివంగి.

సోమా బిక్క చచ్చిపోయి చూస్తున్నాడు.

"సోమా! నీవెల్లి పుస్తకం కొనుక్కో" అంది.

వాడు తుర్రుమని వెళ్లాడు.

ఈరిగాడు కోపంగా వూగిపోయాడు. అసలే తాగి వున్నాడు.

శివంగి జుట్టు పట్టుకుని ఒక్క గుంజు గుంజాడు.

వీపు మీద నాలుగు దెబ్బలు వేసాడు.

"నీయమ్మ! ఏటే పేల్తున్నావా? కూస్తున్నావా? మా మాటంటే మాటే. ఎదురు చెప్తావా?" అంటూ ఎడాపెడా తన్నసాగాడు.

శివంగి ఒక్కసారి విదుల్చుకుని వెనక్కి వెళ్లి తలుపునకు అడ్డం పెట్టిన కర్ర చేతిలోకి తీసుకుంది.

"దొంగ సచ్చినోడా ఏటిరా నీ అధికారం! ఎన్నేళ్ళు అయింది బరిస్తున్నాను. ఆ పసివోడు సదువు మానెయ్యాలా? కూలి పని సెయ్యాలా? నువ్వు తాగి తందనాలాడతావా? నీ సంగతి యియ్యాలతో ఇటో అటో తేలిపోవాలి!" కాళ్ళ మీదా చేతుల మీదా కర్రతో దబాదబా నాలుగు

బాదింది.

ఊహించని ఈ హఠాత్పరిణామానికి ఈరిగాడు షాక్ అయిపోయాడు.

క్రిందపడి లేవలేకపోతున్నాడు.

తాగిన మైకం. వంట్లో శక్తి తగ్గింది. శివంగి నిజంగా శివంగిలా ఊగిపోతోంది. మళ్లీ రెండు దెబ్బలు పడ్డాయి.

"ఓలమో! సచ్చిపోతున్నానుర్రోయ్!" నిస్సహాయంగా కేకలు వేసేడు.

యిరుగు పొరుగు గుమిగూడేరు.

"ఓ లమ్మో! ఈరిగాడు సచ్చిపోతున్నాడురోయ్! శివంగి సంపేస్తోంది! రండిరా" ఓ నలుగురు ముందుకు వచ్చారు.

శివంగి గట్టిగా అరిచింది.

"ముందుకొస్తె సంపేస్తాను. జాగరత. ఓర య్యలూ! ఓ లమ్మలూ! ఇలాగొచ్చీసినారేటి? ఈఏల? అందరికీ జాలేసి ఒచ్చారా? కనికరం పుట్టి ఒచ్చేసినారా? మరి నానెన్ని సార్లు తన్నులు తిన్నప్పుడేటైపోనారు? కళ్ళు గుడ్డివైపోనాయా? చెవులు దిబ్బడేసినాయా? నాను ఇంతకు నాలుగుంతలు తన్నులు తిన్నాను. అప్పుడేటైపోనాదీ కనికరం. అది మొగుడూ, పెళ్లాల తగువని నిమ్మకున్నారు. మరిదీ మొగుడూ, పెళ్లాల తగువే. ఫొండి. నాను ఈడిని కొట్టడం నేదు. ఈడి పాడు బుద్ధిని కొడతన్నాను. మీరిందులో తలెట్టకండి. ఇది మా యింటి తగూ! ఈడిని ఓరేనా ముట్టినా, మంచినీళ్లిచ్చినా మరియాదుండదు జాగరత!"

ముందుకి వచ్చినవాళ్ళు వెనక్కి తగ్గడం చూసి ఈరిగాడికి భయం వేసింది.

"పోలీసుల్ని పిలవండిరా! దీని పొగరణుత్తాను" అన్నాడు.

విచిత్రంగా నవ్వింది శివంగి.

"పిలుచుకోండి పోలీసుల్ని! నాకేం భయమనుకున్నారా! ఇదిగో ఈ కొడవల్తో వళ్లంతా కోసుకుని ఈడే కోసేడని సెప్తాను" అని ఈరిగాడిని చూస్తూ

"అప్పుడు నన్నుకాదు నిన్నొట్టుకెల్తారు జైల్లోకి! ఈసారి నానిడిపించను. ఎనాగూ బయటుంటే తాగి తాగి సస్తావు. జైల్లో ఉంటే మగ్గి మగ్గి సస్తావు. మరి నానెందుకిడిపిస్తాను. ఈ దినం ఒంటిమీద దెబ్బ పడితే నొప్పి పుట్టిందా? మరి నాను దెబ్బలు తిన్నప్పుడో! భార్య మీద అధికారం ఒచ్చీసిందా? మరి నాకూ నీ మీద అధికారం నేదా? నా అధికారం రుచి చూసేవుగా! ఫో బయటికి, ఇంటిలోకి ఒచ్చావో జాగరత!"

కర్రలోపల పెట్టి పొయ్యి రాజేసి వంటచేసి సోమూకి పెట్టి తను తిని తలుపు ధడాల్న గడియ పెట్టి పడుకుంది.

మర్నాడు ప్రొద్దుట ఈరిగాడు నులక మంచంలో మూలుగుతున్నాడు. శివంగి అటువైపు చూడలేదు.

సోమూని స్కూల్‌కి పంపి తను పనిలోనికి వెళ్ళింది.

పని నుండి వచ్చేసరికి ఈరిగాడు నులకమంచంలో లేడు.

ఒకటి...రెండు...మూడురోజులు చూసింది రాలేదు.

* * *

"అయ్యయ్యో! ఎటుపోయాడు?" అంది జానకమ్మ.

"నేను పట్టించుకోనేదమ్మా! ఏడుస్తూ కూకోలేదు. పనికిమాలిన యిరక్తి పెంచుకోనేదు. మా అయ్య నిజాయితీ ఆయమ్మ మంచితనం నా రకతంలో ఉన్నాయి. నా వంట్లో శక్తుంది. నా రెక్కల్లో బలముంది. నాను ధరమంగా ఎల్తాను. మా సోమూని బాగా సదివించి పెద్దోణ్ణి చేస్తాను. మా యమ్మ సెప్పేది మంచి మనసుతో ఏ పనిసేసినా శుభం జరుగుతుందీ అని.. నాకో నిజం అరదం అయిపోనాది"

"ఏమిటి?"

"బతుకులైనా, బాధలైనా మనం భయపడితే అవి భయపిస్తాయి. మనం భయపడకుండా అదరక బెదరక ధరమంగా పోతే అవే మన తోవలోకి వస్తాయి. మణుసులైనా అంతే!"

"అంతేలే ఎవరి ఆత్మవిశ్వాసమే వాళ్లకి అండ. నీకు తప్పకుండా మంచి జరుగుతుంది. ఈరిగాడు వస్తాడులే ఎక్కడికి పోతాడు?"

కిలకిలా నవ్వింది శివంగి.

"ఆడెక్కడికి ఎల్తాడు? నాలుగు దినాల క్రితం సందేలకొచ్చేశాడు. సిమ్మాచలం ఎళ్ళి దేముడి దగ్గర ఎదవ సారా ఇంక తాగను అని ఒట్టేసుకుని మరీ వచ్చాడు. 'ఇంక జనమలో సారా తాగను. బుద్ధి వచ్చింది. నా కళ్ళు నీవే తెరిపించావు శివంగీ' అని చెప్పాడు. ఇప్పుడు హీరోనాగా పన్లోకి పోయి వస్తన్నాడు. వస్తానమ్మగోరూ" అంటూ ధీమాగా నడిచి వెళ్ళిపోయింది శివంగి.

నివ్వెరపోయింది జానకమ్మ.

'దీనికెంత ఆత్మస్థైర్యం! తన శక్తి తను తెలుసుకుని జీవితాన్ని ఆత్మవిశ్వాసంతో ఓ పరిధిలో నడిపించుకుంటోంది' అనుకుంది.

★

## సహజం

''ఎంత నువ్వు సహజ కవయిత్రిగా పేరు తెచ్చుకోవాలని వున్నా ఇదేం బాగాలేదు?'' అన్నాడు భర్త.

''అది కాదండీ. కడుపులో ఎలుకలు పరుగెడుతున్నాయని రాయాలనుకుంటున్నాను. సహజంగా రాయాలి కదా. మీరు రెండు ఎలుకలు మింగి, అవి లోపల ఎలా పరుగెడుతున్నాయో వివరించి చెబితే రాసుకుంటానండీ'' అంది భార్య.

## గుర్తు

''బామ్మా! తాతయ్య గుర్తుకొస్తే ఏం చేస్తావే?'' అడిగింది పదిహేనేళ్ల రమ్య.

''ఏం చేస్తానమ్మా! ఒక్క ఏడుపు ఏడ్చి ఊరుకుంటాను'' అంది బామ్మ.

''తాతయ్య అంటే అంత ప్రేమా?''

''అలాంటిదేనను కో. నా చేతులు నొప్పెట్టేలా కొట్టినా కిక్కురుమనేవారు కాదు'' అంది బామ్మ బాధపడుతూ.

## ఆగిపోయింది

''మీవారి వయస్సు ఎంతమ్మా?''

''యాభై అయిదు''

''మీ వయసు ఎంతమ్మా?''

''ఇరవై అయిదు''

''అంత తేడాతో పెళ్లెందుకు చేసుకున్నారు?''

''అబ్బే అదేం లేదండీ. నా వయసు ఎందుకనో పాతిక దగ్గరకొచ్చి ఆగిపోయింది.''

–వసుపులేటి సాయిలక్ష్మి
(నెల్లూరు)

